సాక్షి
కుమురం భీం

గురువారం । 31 । ఆగస్టు । 2023

కొందరికే 'పోడు'



నంబాలలో గిరిజనులు ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పోడు పట్టాలు అందలేదు. ఇక్కడ కేవలం తొమ్మిది మందికే పట్టాలు ఇచ్చారు.

9లో▸



రక్షాబంధన్ వేడుకలు

పాఠశాలల్లో బుధవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థినులు తోటి విద్యార్థులకు రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు.

9లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.3/25.6

ఆకాశం కొంతమేర మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వేడి, ఉక్కపోత పెరుగుతుంది. ఒకటి రెండు చోట్ల చినుకులు పడతాయి.

న్యూస్‌రీల్

రాఖీ పౌర్ణమికి ఆర్టీసీ బహుమతులు



డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన బాక్స్

ఆసిఫాబాద్‌అర్బన్: రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ఈ నెల 30, 31 తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళలకు లక్కీడ్రా ద్వారా రూ.5.50 లక్షల విలువైన బహుమతులు అందించనున్నట్లు డిపో మేనేజర్ శ్రీధర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని డిపో ఆవరణలో మహిళా ప్రయాణికులు టికెట్లు వేసేందుకు వీలుగా బుధవారం డ్రాప్‌బాక్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు టికెట్ వెనుక తమ పేరు, సెల్ నంబర్ రాసి డ్రాప్‌బాక్స్‌లో వేయాలని సూచించారు. రీజియన్ పరిధిలో లక్కీడ్రా నిర్వహించి సెప్టెంబర్ 9లోగా విజేతలను ఎంపిక చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 040-69440000, 040- 23450033 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'సెకండ్ ఏఎన్‌ఎంలకు నోటీసుల జారీ సరికాదు'



ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోకు రాఖీ కడుతున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

ఆసిఫాబాద్‌అర్బన్: 15 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోకుండా సెకండ్ ఏఎన్‌ఎంలకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం సరికాదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ అన్నారు. బుధవారం సెకండ్ ఏఎన్‌ఎంలు జిల్లా కేంద్రంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో సీతారాంనాయక్‌కు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ సెకండ్ ఏఎన్‌ఎంలను టర్మినేట్ చేస్తామని బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకుంటే ప్రగతిభవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దివాకర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, నాయకులు వసంత, పుణ్యవతి, భాగ్య, భూదేవి, ప్రమీల, సునీత తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో న్యాయ విజ్ఞాన సదస్సు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఆర్‌ఆర్‌వో కాలనీలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి పి.రవి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. వారికి చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టాలను ప్రతిఒక్కరూ గౌరవించాలని సూచించారు. సదస్సులో న్యాయవాదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా కొనసాగుతోంది. బుధవారం దీక్ష శిబిరంలో తబలా వాయిస్తూ.. పాటలు పాడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జీవిత బీమా, ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. వీరి ధర్నాకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతోపాటు వివిధ యువజన సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, కోశాధికారి నగేష్, నాయకులు సంతోష్, రమేశ్, మోహన్, సందీప్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఉన్నతి'

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల, జన్కాపూర్ ఉన్నత పాఠశాలల్లో ఉన్నతి శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ టీచర్లకు శిక్షణ అందిస్తున్నట్లు ఎస్‌వో శ్రీనివాస్ బుధవారం తెలిపారు. విడతల వారీగా సెప్టెంబర్ 5 వరకు శిక్షణ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.



కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

అన్నం పెడ్తలేరు.. ఆరోగ్యం పట్టించుకోరు..

- రోడ్డెక్కిన గిరిజన గురుకుల బాలికలు
- జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిరసన
- వాచ్‌మెన్ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని ఆవేదన
- ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపణ
- రోడ్డుపైనే కన్నీరు పెట్టుకున్న విద్యార్థినులు
- ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



గురుకులం వద్ద ఎండలో విద్యార్థినులు



విలపిస్తున్న విద్యార్థినులు

ఆసిఫాబాద్‌రూరల్: 'మెనూ ప్రకారం భోజనం పెడ్తలేరు.. అన్నంలో పురుగులు వచ్చినా పట్టించుకుంటలేరు.. నైట్ వాచ్‌మెన్ అసభ్యకరంగా ప్రవరిస్తున్నాడు' అంటూ గిరిజన విద్యార్థినులు కన్నీమున్నీరుగా విలపిస్తూ ఆందోళనకు దిగారు. జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాల బాలికలు సమస్యలు పరిష్కరించాలని రోడ్డెక్కారు. సుమారు ఆరు గంటలపాటు వివిధ చోట్ల నిరసన తెలిపారు. గిరిజన గురుకుల పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు 600 మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. సమస్యలతో ఇబ్బంది పడుతున్నా ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి పట్టించుకోకుండా వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. బుధవారం ఉదయం పాఠశాల నుంచి బయటికి వచ్చిన విద్యార్థినులు ప్రిన్సిపాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడే రోడ్డుపై బైఠాయించారు. అనంతరం అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లారు. కలెక్టరేట్ వద్ద ఎండలోనే బైఠాయించారు. విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాలలో భోజనం సక్రమంగా పెట్టడం లేదని, నైట్ వాచ్‌మెన్ అసభ్యకరంగా ప్రవరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. డార్మెంటరీలు శుభ్రంగా లేవని, రెండు రోజులుగా నీళ్ల రావడం లేదని చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రిన్సిపాల్ ఇష్టారీతిన తమను తిడుతూ భయపెడుతుందని విలపించారు. ఈ విషయం ఆర్సీవో దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుకుంటున్న తమ బాధను పట్టించుకోకపోతే ఎలా అని ప్రశ్నించారు. ప్రిన్సిపాల్‌ను తొలగించే వరకూ గురుకులానికి వెళ్లమని భీష్మించుకు కూర్చున్నారు. మధ్యాహ్నం 12.50 గంటల సమయంలో ఓ విద్యార్థిని తండ్రి అరటి పండ్లు, వాటర్‌ప్యాకెట్లు తీసుకొచ్చి వారి ఆకలి తీర్చడం గమనార్హం. పోలీసులు, పాఠశాల టీచర్లు ఎంత బతిమాలినా విద్యార్థినులు మొండికేయడం.. ఎండలో విద్యార్థినుల అవస్థలు గమనించిన టీచర్లు సైతం కన్నీరుపెట్టుకున్నారు. టీచర్లను చూసి విద్యార్థినులూ కన్నీటిపర్యంతమయ్యారు. కలెక్టరేట్ వద్దకు చేరుకున్న ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి విద్యార్థినులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా విద్యార్థినులు వెనక్కి తగ్గకుండా ఆమెకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వివిధ విద్యా సంఘాల నాయకులు విద్యార్థులకు మద్దతు తెలిపారు. డీఎస్పీ శ్రీనివాస్, సీఐ సురేశ్ ఘటన స్థలానికి చేరుకుని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా వారు వినలేదు. అయితే విద్యార్థినులను సముదాయించి తీసుకురావాలని అధ్యాపకులు, ఉపాధ్యాయులపై ప్రిన్సిపాల్ ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. దీంతో కొంత మంది అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థినులతో మాట్లాడి గురుకులానికి తీసుకెళ్లారు. అక్కడ కూడా విద్యార్థినులు 'భోజనం చేయమని.. ప్రిన్సిపాల్ తొలగించే వరకు ఇక్కడే కూర్చుంటాం' అని గేటు ఎదుట బైఠాయించారు. అనంతరం పోలీసులు వారిని సముదాయించి లోపలికి పంపించారు. కొద్దిసేపు చెట్ల కింద కూర్చున్న విద్యార్థులు మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత పాఠశాలలోకి వెళ్లారు. విద్యార్థినుల ఆరోపణలపై ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మిని 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించినా ఆమె అందుబాటులోకి రాలేదు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

గురుకుల పాఠశాలలో సమస్యలు ఉన్న మాట వాస్తవమే. మరమ్మతుల కోసం రూ.15 లక్షల నిధులు మంజూరయ్యాయి. సమస్యలను ఐటీడీఏ పీవో దృష్టికి సైతం తీసుకెళ్లాం. పాఠశాలకు సంబంధించి నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు అందిస్తాం.– గంగాధర్, ఆర్సీవో

ఆస్పత్రికి తీసుకెళ్తలేరు..



ప్రిన్సిపాల్‌కు చెప్పినా సమస్యలను పట్టించుకోవడం లేదు. జ్వరం వచ్చినా ఆస్పత్రికి తీసుకెళ్లడం లేదు. ప్రస్తుతం ఓ విద్యార్థి ఆరోగ్యం విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటుంది. – స్వాతి, ఇంటర్

అన్నంలో పురుగులు



మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు. అన్నంలో పురుగులు వస్తున్నాయి. ప్రిన్సిపాల్‌కు చెప్పినా అదే తినాలి అని చెబుతున్నారు. కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. – ఆర్తి, తొమ్మిదో తరగతి

వేరే కళాశాలలో చేర్పిస్తా



మా పాప నిఖిత గిరిజన గురుకులంలో ఇంటర్ చదువుతోంది. కళాశాలలో కనీస సౌకర్యాలు లేక చాలా ఇబ్బంది పడుతున్నానని ఏడుస్తోంది. టీసీ తీసుకుని వెళ్లి వేరే కళాశాలలో చేర్పిస్తా. – రమేశ్, విద్యార్థిని తండ్రి

శ్యామ్‌కే 'హస్తం' టికెట్!

- ఆసిఫాబాద్ కాంగ్రెస్ టికెట్ రిటైర్డ్ రవాణా అధికారికే..!
- సందిగ్ధంలో 'సిర్పూర్'
- పొత్తుల్లో బీఎస్పీకి మద్దతిచ్చే అవకాశం?
- సెప్టెంబర్ రెండోవారంలో అభ్యర్థుల జాబితా విడుదల



అజ్మీరా శ్యామ్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు

సాక్షి, ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను రిటైర్డ్ రవాణా శాఖ అధికారి అజ్మీరా శ్యామ్‌నాయక్‌కు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్టానం తుది నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. నియోజకవర్గం నుంచి మర్సుకోల సర్వసతి, అజ్మీరా శ్యామ్ నాయక్, బుర్స పోచయ్య పేర్లను జిల్లా అధ్యక్షుడు ప్రతిపాదించగా.. గెలుపు గుర్రాలను బరిలో దించాలనే యోచనలో ఉన్న కాంగ్రెస్ శ్యామ్‌నాయక్ వైపే మొగ్గు చూపినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వచ్చే నెల మొదటి వారంలో ప్రదేశ్ ఎన్నికల కమిటీ సిద్ధం చేసిన తుది జాబితాను స్క్రీనింగ్ కమిటీకి అందజేయనుంది. రెండోవారంలో అభ్యర్థుల తొలి జాబితాను వెలువడనుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ పార్టీ ప్రకటించే మొదటి జాబితాలో శ్యామ్‌నాయక్ పేరు ఉంటుందని తెలుస్తోంది.

మొదలైన హడావుడి..

ఎన్నికల బరిలో నిలిచే తమ అభ్యర్థులను ప్రకటించి అధికార పార్టీ ముందస్తుగానే సన్నద్ధం కావడంతో జిల్లాలో ఎన్నికల హడావుడి మొదలైంది. జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను బీఆర్‌ఎస్ పార్టీ ఖరారు చేయడంతో ప్రధాన విపక్ష పార్టీ కాంగ్రెస్ కూడా తమ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసింది. ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన అభ్యర్థిపై ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆసిఫాబాద్ నుంచి శ్యామ్ నాయక్‌ను ఎంపిక చేయాలనే నిర్ణయానికి అధిష్టానం వచ్చినట్లు పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి పది మంది ఆశావహులు టికెట్ కోసం దరఖాస్తు చేశారు. అందులో ఇటీవల పార్టీలో చేరిన శ్యామ్ నాయక్ కూడా ఉన్నారు. అధికార పార్టీ అభ్యర్థి కోవ లక్ష్మిని ఢీకొట్టాలంటే అందుకు శ్యామ్‌నాయకే సరైన అభ్యర్థి అని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోందని సమాచారం. ఇంజనీరింగ్ పట్టభద్రుడు.. జిల్లా ప్రజలతో సత్సంబంధాలు ఉన్న వ్యక్తి.. ఇక్కడే జిల్లా రవాణా శాఖాధికారిగా ఏడేళ్లపాటు పనిచేయడంతోపాటు సౌమ్యుడనే పేరున్న శ్యామ్‌నాయక్‌కు సర్వేలు కూడా అనుకూలంగా ఉండడంతో ఆయననే అభ్యర్థిగా ఖరారు చేయాలనే నిర్ణయానికి వచ్చారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

సిర్పూర్‌పై అనిశ్చితి..!

సిర్పూర్ నియోజకవర్గ అభ్యర్థిని ఖరారు చేసే విషయంలో కాంగ్రెస్ అధిష్టానం సందిగ్ధంలో పడినట్లు సమాచారం. మొదటి విడత జాబితాలోనే ఈ నియోజకవర్గ అభ్యర్థి పేరును ఖరారు చేయాల్సి ఉండగా.. ఇంతలోనే అధిష్టానం పునరాలోచనలో పడడం సిర్పూర్ నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. సిర్పూర్ స్థానానికి నలుగురు ఆశావహులు దరఖాస్తులు చేయగా.. అక్కడ అభ్యర్థి ఎంపికకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది. ఇక్కడి నుంచి ఎవరిని పోటీకి దించాలా అనే అంశంపై పూర్తిస్థాయిలో పీసీసీలో ఏకాభిప్రాయం రాలేదని తెలుస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. సర్వేల ఆధారంగా అక్కడ కాంగ్రెస్ పార్టీకి గెలుపు అవకాశాలు చాలా తక్కువగా ఉన్నట్లు తేలడమే అందుకు కారణమని తెలుస్తోంది. పొత్తుల్లో భాగంగా బీఎస్పీ అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌కు మద్దతు ఇస్తే ఎలా ఉంటుందనే యోచన చేస్తున్నట్లు సమాచారం.

జోరు పెంచిన కాంగ్రెస్..

జిల్లాలో శాసనసభ ఎన్నికల వేడి ఇప్పటికే మొదలైంది. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎవరు? బరిలో నిలబడతారు అనే స్థితి నుంచి, వామ్మో ఇంతమంది టికెట్ కోసం పోటీ పడుతున్నారా? అనే పరిస్థితి జిల్లాలో కనిపిస్తుండడంతో.. అధికార పార్టీని ఢీకొట్టే విధంగా కాంగ్రెస్ పార్టీ వివిధ రూపాల్లో ప్రజల్లోకి వెళ్తోంది. వలసలతో జిల్లాలో చాలా కాలంగా స్తబ్దుగా ఉంటూ వచ్చిన కాంగ్రెస్.. కర్ణాటక ఎన్నికలతో నూతనోత్సాహంతో కార్యక్రమాలను పెంచింది. అధిష్టానం పిలుపుతో ఆందోళనలు, వివిధ వర్గాలకు ఎన్నికల హామీగా ప్రకటిస్తున్న డిక్లరేషన్లపై గడపగడపకూ ప్రచారం కార్యక్రమాన్ని విస్తృతం చేసింది.

విద్యార్థులు మొక్కలను సంరక్షించాలి

- డీఈవో అశోక్



విద్యార్థులు తయారు చేసిన రాఖీలను పరిశీలిస్తున్న డీఈవో అశోక్

సిర్పూర్(టి): విద్యార్థులు బాధ్యతగా మొక్కలను సంరక్షించాలని డీఈవో అశోక్ అన్నారు. మండలంలోని వేంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థులు తయారు చేసిన రాఖీలను పరిశీలించారు. వృక్ష రక్షాబంధన్ కార్యక్రమంలో భాగంగా మొక్కలకు రాఖీలు కట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జాతీయ హరితదళం కోఆర్డినేటర్ మధుకర్, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు సుగుణ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో చదివే నైపుణ్యం పెంచాలి

కాగజ్‌నగర్‌టౌన్: విద్యార్థుల్లో చదివే నైపుణ్యం పెంచాలని డీఈవో అశోక్ అన్నారు. కాగజ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల(ఓల్డ్)లో నిర్వహిస్తున్న ఉన్నతి శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులపై విద్యాశాఖ ప్రత్యేకంగా దృష్టి సారించి 'ఉన్నతి' కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. ఈ శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకొని విద్యార్థుల్లో చదివే నైపుణ్యాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ శ్రీలత, జిల్లా సైన్స్ అధికారి మధుకర్, రిసోర్స్ పర్సన్లు ఎం.తిరుపతయ్య, శ్యాంసుందర్, గంగాధర్, గోపి, శాంతికుమార్, మధుకర్, జావిద్, దేవరావు, ప్రధానోపాధ్యాయుడు నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెట్రోల్‌పంపు ప్రాంతంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో సందర్శించారు.

జిల్లాకు నిధుల వరద

- రూ.పది లక్షల చొప్పున పంచాయతీలకు..
- ఒక్కో మున్సిపాలిటీకి రూ.25 కోట్లు
- జిల్లాకు మొత్తం రూ.158.50 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు

సాక్షి, ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా జూన్ 30న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు హామీ ఇచ్చినట్లుగానే జిల్లా అభివృద్ధి పనులకు సీఎం ప్రత్యేక నిధుల నుంచి రూ.83.50 కోట్లు మంజూరు చేశారు. ప్రగతి నివేదన సభలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. అలాగే ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలకు రూ.25 కోట్లు చొప్పున రూ.50 కోట్లు, జిల్లాలోని 335 గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున రూ.33.50 కోట్లు సీఎం ప్రత్యేక నిధి నుంచి మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. అందులో భాగంగా బుధవారం రూ.83.50 కోట్ల నిధులకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. ఈ నిధులతో పంచాయతీలు, మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు పట్టాలెక్కనున్నాయి. కౌటాల మండలంలో వార్దా నదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి మరో రూ.75 కోట్లు మంజూరు చేశారు. జిల్లాకు నిధులు విడుదలపై ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, వైస్ చైర్మన్ రాచకొండ గిరీశ్‌కుమార్‌లు సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీపీ, ఎంపీడీవో మధ్య వాగ్వాదం

చింతలమానెపల్లి(సిర్పూర్): చింతలమానెపల్లి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ డుబ్బుల నానయ్య, ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కార్యాలయం పరిపాలన వ్యవహారాలకు సంబంధించిన విషయాలపై ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బందిని ఇబ్బంది పెట్టడంతోపాటు ప్రజాప్రతినిధులతో అగౌరవంగా వ్యవహరిస్తున్నాడని ఎంపీపీని నిలదీశారు. దీనికి ఎంపీడీవో దురుసుగా సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. రణవెల్లి ఎంపీటీసీ ధన్‌రాజ్ గ్రామ పరిధిలో ఇటీవల రూ.3లక్షలతో కల్వర్టు పనులు చేపట్టారు. రికార్డులు అందించినా ఎంపీడీవో బిల్లులు ఇవడం లేదని, రూ.5వేలు లంచం డిమాండ్ చేశాడని ఆరోపిస్తూ ఎంపీటీసీ ధన్‌రాజ్ ఎంపీపీకి ఫిర్యాదు చేశారు. అలాగే ఎంపీడీవో తమను వ్యక్తిగతంగా ఇబ్బంది పెడుతున్నాడని పంచాయతీ కార్యదర్శులు సైతం ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కార్యాలయంలో ఎంపీపీ, ఎంపీడీవో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఎంపీపీ నానయ్య మాట్లాడుతూ ఎంపీడీవో తనతో దురుసుగా ప్రవర్తించడంతో ఆగ్రహం వ్యక్తం చేశానని తెలిపారు. ఎంపీడీవోపై కలెక్టరేట్ ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన వివరించారు. ఈ విషయంపై ఎంపీడీవో సత్యనారాయణను సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

బాబా అడుగుజాడల్లో నడవాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- పట్నాపూర్‌లో ఘనంగా పూలాజీబాబా జయంతి



బాబా చిత్రపటానికి నమస్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు, తదితరులు



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

జైనూర్(ఆసిఫాబాద్): ప్రతిఒక్కరూ పూలాజీ బాబా అడుగుజాడల్లో నడవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జైనూర్ మండలం పట్నాపూర్‌లోని సిద్దేశ్వర సంస్థాన్‌లో బుధవారం నిర్వహించిన పూలాజీబాబా జయంత్యుత్సవాలకు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో మంది గిరిజనులు చెడు వ్యసనాలను వదిలి ఆధ్యాత్మిక మార్గం వైపు నడిచేలా కృషి చేసిన ఘనత బాబాదే అన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి మాట్లాడుతూ వేలాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన మహాత్ముడు బాబా అని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం బాబా జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ పేర్కొన్నారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయడంతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆత్రం సక్కు పాట పాడి అలరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ యాదవ్‌రావు, కాంగ్రెస్ నాయకుడు అజ్మీరా శ్యాంనాయక్, సంస్థాన్ కమిటీ అధ్యక్షుడు కేశవ్ ఇంగ్లే, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఉమ్మర్ఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్‌రావ్ ఇంగ్లే, మాజీ డిప్యూటీ చైర్మన్ శివాజీ మోగే, ఎంపీపీలు కుమ్ర తిరుమల, తొడసం భాగ్యలక్ష్మి, తహసీల్దార్ హైమద్ ఖాన్, ఎంపీడీవో ప్రభుదయ, సీఐ మల్లేశ్, ఎస్సై సందీప్‌కుమార్, సంస్థాన్ కమిటీ ఉపాధ్యక్షుడు వామన్ ఇంగ్లే తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు కార్యాచరణ రూపొందించాలి

- అదనపు కలెక్టర్ వేణు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణు

ఆసిఫాబాద్‌అర్బన్: 2023– 24 వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో ధాన్యం సేకరణకు కార్యాచరణ రూపొందించాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వ్యవసాయ, పౌరసరఫరాలు, మార్కెటింగ్, కార్మిక, రవాణా, తూనికలు కొలతలు, ఐకేపీ అధికారులు, రైస్ మిల్లుల యజమానులతో బుధవారం ధాన్యం సేకరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం సేకరణకు ముందస్తుగా ప్రణాళికలు రూపొందించుకుని, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వరిసాగు వివరాలను నిర్దేశించిన ప్రొఫార్మా ప్రకారం నమోదు చేయాలని ఆదేశించారు. రైస్ మిల్లర్లు సీఎంఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు.

'డిస్మిస్ కార్మికులకు ఉద్యోగ అవకాశం కల్పించాలి'

మందమర్రిరూరల్(చెన్నూర్): సింగరేణిలో డిస్మిస్ అయిన కార్మికులందరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిస్మిస్ కార్మికసంఘం అధ్యక్షుడు రవీందర్ డిమాండ్ చేశారు. బుధవారం దీక్ష శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గోదావరిలోయ బొగ్గుగని కార్మికసంఘం నాయకులు మేకల పోచమల్లు, జీ.రాములు, రాయమల్లు, తదితరులు పాల్గొన్నారు.

రక్షణపై కార్మికులకు అవగాహన



మాట్లాడుతున్న అధికారి

రామకృష్ణాపూర్(చెన్నూర్): మందమర్రి ఏరియాలోని ఆర్కేపీ ఓసీలో బుధవారం కార్మికులకు రక్షణపై అవగాహన కల్పించారు. పనిస్థలాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండటం ద్వారానే ప్రమాదాలబారిన పడకుండా ఉంటామని, రక్షణ సూత్రాలను తప్పకుండా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ ఏజీఎం గుప్తా, సిమ్‌టర్స్ మేనేజర్ విజయ్‌కుమార్, ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, సేఫ్టీ ఆఫీసర్ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకుడు అకాల మృతి


మల్లయ్య (ఫైల్)

బెల్లంపల్లి: భారత కమ్యూనిస్టుపార్టీ (సీపీఐ) సీనియర్ నాయకుడు పుల్లూరి మల్లయ్య (66) మంగళవారం రాత్రి అకాల మృతి చెందాడు. 30 ఏళ్ల పాటు సీపీఐ పట్టణ కార్యవర్గ సభ్యుడిగా, ఏఐటీయూసీ ఏరియా ఆస్పత్రి పిట్ సెక్రెటరీగా పనిచేశారు. ప్రజా ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేశారు. బుధవారం మృతదేహానికి సీపీఐ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్, నాయకులు చిప్పనర్సయ్య, ఎం.వెంకటస్వామి, దాగం మల్లేశ్, ఆడెపు రాజమౌళి, అక్కెపల్లి బాపు, బి.లక్ష్మీనారాయణ, ఉపేందర్, ఎల్తూరి శంకర్, బి.వెంకటస్వామి, రత్నం రాజం, బి.రాంచందర్, మహేందర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, రాంనాథ్ నివాళులర్పించారు.

కారు బోల్తా..నలుగురికి గాయాలు

జైపూర్(చెన్నూర్): మండలంలోని ఇందారం సమీపంలో రాజీవ్ రహదారిపై బుధవారం కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. జగిత్యాల జిల్లాకు చెందిన మనోహర్‌రావు, సుమతి, శైలజ, రమాదేవి పెద్దపల్లి జిల్లా గోదావరిఖని నుంచి ఇందారం మీదుగా మంచిర్యాలకు వెళ్తుండగా ఇందారం ఫ్లైవోవర్ బ్రిడ్జిపై కారు అదుపు తప్పి బోల్తా పడడంతో నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: అమాయక ప్రజలను మట్కా జూదానికి ప్రోత్సహిస్తున్న నిర్వాహకుడు షేక్ ఇర్షద్‌ను టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్సై రమణా రెడ్డి వివరాల ప్రకారం.. పట్టణంలోని సుందరయ్యనగర్‌లో సుల్తాన అనే మహిళ ఇంటిని రెండు నెలల క్రితం అద్దెకు తీసుకుని మట్కా నిర్వహిస్తున్నాడు. పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానం వచ్చి తనిఖీ చేయగా మట్కా చీటీలు లభ్యమైనట్లు తెలిపారు. అతడి నుంచి రూ.3వేల నగదుతో పాటు రెండు మట్కా పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. మరో మట్కా నిర్వాహకుడు మహ్మద్ లతీఫ్ పరారైనట్లు పేర్కొన్నారు. కాగా అసాంఘిక కార్యకలాపాల కోసం ఇంటిని అద్దెకు ఇచ్చిన యజమాని సుల్తానపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



నీకు నేను.. నాకు నీవు రక్ష

- సోదరులకు రాఖీ కట్టేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అక్కాచెల్లెళ్లు
- అనుబంధాలను బలోపేతం చేస్తున్న రక్షా బంధన్
- అభిప్రాయాలను పంచుకున్న సోదరీమణులు

అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా జరుపుకునే పండుగనే రాఖీ. ఈ పండుగను ఇప్పుడు దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారు. సోదరి తన సోదరుడు ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ రాఖీ కట్టి ఎల్లప్పుడూ అన్నకు అండగా ఉంటానని చెప్తుంది. సోదరి కట్టిన రక్షాబంధనాన్ని స్వీకరించిన అన్న తానెప్పుడూ చెల్లెలికి రక్షగా ఉంటానని ఈ పండుగ ద్వారా తెలియజేస్తారు. సమాజంలో బంధాలు, అనుబంధాలు దూరమవుతున్న తరుణంలో రక్షాబంధన్ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధాలను బలోపేతం చేస్తుంది. సోదర సోదరీమణుల మధ్య ఉండే అనుబంధానికి, ప్రేమానురాగాలకు అద్దం పట్టే పండుగ కావడంతో మానవ సంబంధాల మెరుగుదలకు, విచక్షణకు ఇది ఎంతో దోహదం చేస్తుంది. ఆత్మీయుల మధ్య అనుబంధాలకు, ఐకమత్యానికి, పరస్పర సహకారానికి చిహ్నంగా రక్షాబంధనం నిలుస్తుంది. రాఖీ పండుగ సందర్భంగా జిల్లాలోని సోదరులకు రాఖీ కట్టేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అక్కా చెల్లెళ్లు తమ అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

హైదరాబాద్ నుంచి వచ్చా



కౌటాల: రాఖీ పండగ సందర్భంగా మా అన్నకు రాఖీ కట్టడానికి హైదరాబాద్ నుంచి కౌటాలకు వచ్చా. నా పెళ్లి అయిన తర్వాత మొదటి పండుగ కావడంతో మా ఆయనతో కలిసి వచ్చా. ఈ పండుగ నాకు ఎంతో ప్రత్యేకమైనది. కుటుంబ సభ్యులందరం కలిసి పండుగ జరుపుకుంటాం. – అనూష, హైదరాబాద్

ఆత్మీయ పండుగ



మా తల్లిదండ్రులకు ఇద్దరం ఆడపిల్లలం. ఏటా గుడ్లబోరిలో ఉన్న మా పెద్దనాన్న కుమారుడు డొంగ్రె దినకర్‌కు రాఖీ కడుతున్నా. మా వయస్సు పెరిగినా అన్నాచెల్లెళ్ల ఆత్మీయ బంధం మర్చిపోం. మాకు సోదరులు లేనిలోటును మా అన్నయ్య తీరుస్తున్నారు. ఈ పండగంటే చాలా ఇష్టం. – కె.సోమబాయి, రాస్పెల్లి

ఏటా వచ్చి రాఖీ కడుతా



బెల్లంపల్లి : చిన్నతనంలో తోబుట్టువులతో కలిసి ఉండి పెళ్లై అత్తారింటికి వెళ్లాక ఎడబాటు వస్తుంది. అన్నదమ్ములు గుర్తుకు వచ్చినప్పుడల్లా పుట్టింటికి రాలేం. కానీ రాఖీ పండుగకు మాత్రం జన్నారం మండలం ఇందన్‌పల్లి నుండి తప్పక వచ్చి అన్నదమ్ముల చేతికి రాఖీ కట్టి దీవెనలు తీసుకుంటా.

– ఆదిమూలపు లక్ష్మి, ఇందన్‌పల్లి

కొత్త ఉత్సాహం..



బెల్లంపల్లి: రాఖీ పండుగ కొత్త ఉత్సాహం నింపుతుంది. ఈ పండుగ కోసం ఏడాది పాటు ఎదురు చూస్తుంటా. ఎక్కడెక్కడో స్థిరపడిన అక్కాచెల్లెళ్లు రాఖీపౌర్ణమికి కచ్చితంగా కలుసుకుంటారు. ఎన్ని పనులున్నా హైదరాబాద్ నుండి తాండూర్ మండలంలోని మాదారం వచ్చి రాఖీ కడుతా.

– గుండా అక్షర, హైదరాబాద్

15 సంవత్సరాలుగా రాఖీ కడుతున్న



జన్నారం: మాది కవ్వాల్. మా పుట్టిళ్లు జగిత్యాల జిల్లా సంగంపల్లి. పదిహేనేళ్లుగా ఏటా రాఖీ పండుగ రోజున పుట్టింటికి వెళ్లి రాఖీ కడుతున్నా. ఈ సంవత్సరం రెండు రోజులు ముందుగానే వెళ్లి రాఖీ కట్టా.

– లక్ష్మి, కవ్వాల్

ముంబయి నుంచి ...



కోటపల్లి: రాఖీ పండుగ అంటే నాకు చాలా ఇష్టం. మా ఆయన వృత్తిరీత్యా ముంబయిలో ఉంటున్నాం. నాకు ముగ్గురు అన్నదమ్ములు. పండుగకు ముందురోజే ముంబాయి నుంచి కోటపల్లికి వస్తాం. రాఖీ పండుగకు అందరం కలుసుకోవడం ఆనందంగా ఉంటుంది.

– భవాని, ముంబయి

యూకే నుంచి వచ్చా



చెన్నూర్‌రూరల్: నా భర్త ఉద్యోగరీత్యా యూకేలో స్థిరపడ్డాం. మా పుట్టిళ్లు మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం పొక్కూరు. నాకు వివాహమైనప్పటి నుంచి ఏటా పదిరోజుల ముందే మా అన్నయ్యలకు రాఖీలు పంపించేది. ఈసారి రాఖీ కట్టేందుకు వచ్చా. రాఖీ పౌర్ణమిని ఎంతో ఆనందంగా జరుపుకుంటాం.

– చల్ల అనూష, యూకే

రాఖీ పండుగకు తప్పకుండా వస్తా



దండేపల్లి: మా పుట్టిళ్లు దండేపల్లి మండలం చింతపల్లి. నా భర్త హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుండడంతో అక్కడే ఉంటున్నాం. ఏటా రాఖీ పండుగకు చింతపల్లికి వచ్చి నా సోదరుడు అమరేందర్‌కు రాఖీ కడుతా. రాఖీ పండగను ఎంతో సంతోషంగా జరుపుకుంటాం.

– మౌనిక, చింతపల్లి

అన్నకు ముద్దుల చెల్లిని



చెన్నూర్: నేను మా అన్నకు ముద్దుల చెల్లిని. ఉన్నత చదువులరీత్యా ఏడేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నా. ఏటా రాఖీపౌర్ణమికి చెన్నూర్‌కు వచ్చి అన్నయ్యకు రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకుంటా.

– సద్దనపు సాయికృపా, హైదరాబాద్

ఎదురుచూస్తుంటాం



ఆసిఫాబాద్‌అర్బన్: మా పుట్టిళ్లు ఆసిఫాబాద్. ఏటా రాఖీ పౌర్ణమికి వరంగల్ నుంచి వచ్చి మా అన్నయ్యకు రాఖీ కడుతా. ఇలా రాఖీ కట్టడం వలన మాఅన్నయ్యకు ఏడాదంతా మంచి జరుగుతుందని నమ్మకం. అమ్మానాన్నలతో కలిసి పండుగ జరుపుకుంటాం. అమ్మ చేతి వంటలను ఆస్వాదిస్తాం.

– తాటిపల్లి ఈశ్వర్, శ్రేష్ఠ, అన్నా చెల్లెలు, వరంగల్

గుడికే కన్నం వేశారు!

- గూడెం సత్యదేవుడి ఆలయంలో చోరీ
- అమ్మవారి నగలు, హుండీ డబ్బులు అపహరణ

దండేపల్లి(మంచిర్యాల): దోపిడీ దొంగలు ఏకంగా దేవుని గుడికే కన్నం వేశారు. మంచిర్యాల జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం తెలవారుజామున చోరీకి పాల్పడ్డారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు, ఆలయ అధికారులు పరిశీలించగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ముసుగులు ధరించి చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. బుధవారం ఉదయం ఆలయ సిబ్బంది సత్తయ్య గుట్టపైకి వెళ్లి చూడగా సీసీ కెమెరాలు తిప్పి ఉండటంతో పాటు ఒక కెమెరా పగిలి ఉంది. పైగా ఆలయ గేటు తాళాలు పగులగొట్టి హుండి బయట పడేసి ఉన్నాయి. ఆలయ ఈవో శ్రీనివాస్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో లక్సెట్టిపేట సీఐ కృష్ణ, దండేపల్లి ఎస్సై ప్రసాద్ ఘటనాస్థలికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి ఫింగర్ ప్రింట్స్ సేకరించారు.

నగలు, హుండీ డబ్బులు అపహరణ

ఇనుప రాడ్లతో ఆలయ తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు ప్రధాన ఆలయం వద్ద ఉన్న నాలుగు హుండీలలో ఒకదానిని పగులగొట్టి సుమారు రూ.5వేల నుంచి రూ.7వేల వరకు నగదును, గర్భగుడి తాళాలు పగులగొట్టి అమ్మవారి మెడలో ఉన్న 8 గ్రాముల మంగళ సూత్రాన్ని దొంగిలించారు. అపహరణకు గురైన సొత్తు విలువ మొత్తం రూ.30వేల వరకు ఉంటుందని ఆలయ ఈవో పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ఈవో, సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ

కార్మికులకు ఏరియర్స్ వెంటనే చెల్లించాలి


మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్(చెన్నూర్): 11వ వేజ్‌బోర్డు తాలూకు ఏరియర్స్ వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి అక్బర్‌అలీ డిమాండ్ చేశారు. బుధవారం మందమర్రి ఏరియాలోని ఆర్కేపీ ఓసీలో గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియర్స్‌పై కోలిండియా నుంచి సర్క్యులర్ వచ్చినప్పటికీ ఇంకా చెల్లించకపోవడం సరికాదన్నారు. సంస్థకు వచ్చిన లాభాలనుండి వాటా కూడా ప్రకటించాలన్నారు. సెప్టెంబర్ 1న జీఎం కార్యాలయం ఎదుట చేపట్టనున్న మహాధర్నాకు కార్మికులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఇప్పకాయల లింగయ్య, అంజనేయులు, సంపత్, వెంకట్‌రెడ్డి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మొరం తవ్వకాలను అడ్డుకున్న అధికారులు


తవ్వకాలను పరిశీలిస్తున్న ఆర్ఐ సమ్మక్క

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండల కేంద్రంలోని శిల్వగుట్ట వద్ద జరుగుతున్న మొరం అక్రమ తవ్వకాలను మంగళవారం సాయంత్రం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రి పక్కా భవనం నిర్మాణానికి శిల్వగుట్ట వద్ద నుంచి అధికార పార్టీ నాయకులు మొరం తరలించడం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు వాహనాలను నిలిపివేసి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆర్ఐ సమ్మక్క సంఘటన స్థలానికి చేరుకుని వాహనాలను ఆపాలని చెప్పడంతో ట్రాక్టర్ యజమానులు రెవెన్యూ అధికారులపై దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్ అక్కడికి రావడంతో ఇరుపార్టీలకు మధ్య జరిగిన గొడవలో ఆయన చేతికి గాయాలయ్యాయి. పోలీసులు రావడంతో అంతా అక్కడినుంచి వెళ్లిపోయారు. బుధవారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు మూడు ట్రాక్టర్లు, జేసీబీని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. గొడవపై పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

కొనసాగుతున్న టీఎన్జీవోస్ సొసైటీ స్థల సర్వే

- ఆందోళనతో స్పృహతప్పిన బాధితుడు
- ఆస్పత్రికి తరలింపు


స్పృహతప్పి పడిపోయిన నర్సయ్య

నస్పూర్(మంచిర్యాల): పట్టణంలో చేపట్టిన టీఎన్జీవోస్ సొసైటీ స్థలం సర్వే కొనసాగుతోంది. సంబంధిత అధికారులు బుధవారం తమ స్థలంలో సర్వే చేస్తుండగా ఏం జరుగుతుందో తెలియక ఆందోళన చెందిన కసుమల్ల నర్సయ్య అనే వ్యక్తి స్పృహతప్పి కింద పడిపోయాడు. స్థానికులు వెంటనే అతడిని మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై నర్సయ్య కుమారుడు రాణాప్రతాప్‌ని 'సాక్షి' సంప్రదించగా మానాన్న పేరుమీద నస్పూర్ శివారు సర్వే నంబర్ 42లో ఎకరం 16 గుంటల భూమి ఉందన్నారు. ఆ భూమిలో అధికారులు సర్వే చేస్తున్నారని తెలియడంతో మానాన్నతో కలిసి అక్కడికి వెళ్లామన్నారు. ఈ భూమి కేసు కోర్టు పరిధిలో ఉందని, అలాంటప్పుడు మీరు సర్వే ఎలా చేస్తారని ప్రశ్నించడంతో అక్కడే ఉన్న టీఎన్జీవో నాయకులు కొందరు నీకు ఇక్కడ ఎలాంటి భూమి లేదు.. నీవు ఇక్కడి నుండి పొమ్మని మా నాన్నతో వాగ్వాదానికి దిగడంతో ఆందోళన చెంది స్పృహతప్పి పడిపోయాడన్నారు. ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు హార్ట్‌స్ట్రోక్ వచ్చిందని నిర్ధారించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాఖీ వేడుకలు


ఎమ్మెల్యే చేతికి రాఖీ కడుతున్న కౌన్సిలర్లు

బెల్లంపల్లి: రాఖీ పండుగను పురస్కరించుకుని బుధవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఏఎంసీ ఏరియాలో ఉన్న క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే చిన్నయ్య, ఆయన సతీమణి జయతారకు మహిళ ప్రజాప్రతినిధులు హారతి ఇచ్చి ఎమ్మెల్యే చేతికి రాఖీ కట్టి ఆత్మీయతను ప్రదర్శించారు. ప్రత్యేకంగా ముస్లిం మహిళ కౌన్సిలర్ ఆస్మాబేగం చిన్నయ్యకు రాఖీ కట్టడం అందరి దృష్టిని ఆకర్షించింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, ఎంపీటీసీ మాసాడి శ్రీదేవి, మున్సిపల్ మహిళ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పట్టణంలో కనీస వసతులు కరువు


డ్రెయినేజీని చూపుతున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో కనీస మౌలిక వసతులు కల్పించడంలో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 11వ వార్డు గొల్లవాడలో బుధవారం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంకటేశ్వర్‌రావు, ఆరెందున నివాస్, శివ, ముదాం మల్లేశ్, రాకేశ్, అశోక్, సత్యనారాయణ, దీపక్ పాల్గొన్నారు.

గోపాలమిత్ర కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న గోపాలమిత్ర కేంద్రాల ఏర్పాటుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా పశు గణాభివృద్ధి అధికారి కిషన్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. నిర్మల్ జిల్లాలో కుభీర్ మండలంలోని మర్లగొండ, భైంసా మండలం వానల్‌పహాడ్, బాసర మండలం కౌట, మంచిర్యాల జిల్లాలోని కోటపల్లి మండలంలోని దేవులవాడ, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పెంచికల్‌పేట్ మండలంలోని బొంబాయి గూడ, లింగాపూర్ మండలంలోని ఫట్‌కల్‌మంగి, రెబ్బెన మండలంలోని గోలేటిలో ఖాళీగా ఉన్నట్లుగా తెలిపారు. వీటికి పదో తరగతి ఉత్తీర్ణులై, 18–35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉన్న వారు అర్హులన్నారు. అలాంటి వారు ఫొటోతో కూడిన స్థానిక నివాస ధృవీకరణ పత్రం(ఆధార్ లేదా రేషన్‌కార్డు) ఫొటోతో తమ దరఖాస్తులను సెప్టెంబర్ 11వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా జిల్లా కేంద్రంలోని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

వికసించిన రాఖీ పుష్పాలు


రాఖీ పుష్పాలు

నెన్నెల: మండల కేంద్రంలోని గొల్లవాడలో దూపం చందు ఇంటిముందున్న చెట్లకు రాఖీ పుష్పాలు వికసించాయి. వీటిని పంచపాండవుల పుష్పాలు అని కూడా అంటారని స్థానికులు పేర్కొంటున్నారు. రాఖీని పోలినట్లు ఉన్న ఈ పుష్పంలో చుట్టూ నీలిరంగు రేకులు 101 ఉండగా మధ్యలో తెల్లటి వర్ణంలో ఉండే కేశనాలికలు ఐదు ఉన్నాయి. వీటిని పంచపాండవులుగా భావిస్తారని చెబుతున్నారు.